క్లుప్తంగా

ఆధార్ నమోదు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



కంకిపాడు: ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు డీఎల్డీఓ ఎస్.రాజేష్ సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు–2, మంతెన సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు మంగళవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన శిబిరాల్లో సచివాలయ పరిధిలోని పలువురు స్థానికులు ఆధార్‌నమోదు, తప్పుల సవరణ అర్జీలు అందించారు. క్యాంపులను డీఎల్డీఓ రాజేష్ పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఏర్పాటుచేసిన శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



కంకిపాడు: రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాలతో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఈడుపుగల్లులో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సీఐ మురళీకృష్ణ ప్రారంభించారు. 24 మంది యువత, పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. రక్తదానంతో ప్రాణదాతలు కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.సందీప్, చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రవీంద్ర, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



పెనమలూరు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి ఉత్తమ పౌరులుగా ఎదగాలని తాడిగడప బ్రాంచి యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మాధురి లాలస అన్నారు. పోరంకి పీవీఎస్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజం ఏర్పడటానికి అందరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. దేశ ప్రగతికి విద్యార్థులు పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల చైర్మన్ పంచుమర్తి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ ప్రసూనాంబ, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది సుమన, సునీత, మాధురి, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి కూడా ఆర్థిక నేరాలు జరుగుతున్నాయని దీనిపై బ్యాంకర్లు కూడా అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ సూచించారు. పటమట పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని 30 మంది బ్యాంకర్లతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. బ్యాంకుల్లో, బ్యాంకుల బయట 360 డిగ్రీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పటమట సీఐ పవన్‌కిషోర్, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ ఇల్లు.. ఓ నందనవనం

- మట్టితో అవసరం లేకుండా కోకోపిట్‌తో మొక్కల పెంపకం
- ఖాళీ పెరట్లో కూరగాయల మొక్కల సాగు
- ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా సాధ్యమంటున్న చలివేంద్రపాలెం సర్పంచ్ శివనాగిరెడ్డి



డాబాపై కవర్లలో కోకోపిట్ నింపి పెంచుతున్న టమాటా, మిర్చి, బంతి మొక్కలు



ఇంటి పెరటిలో సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి

కంకిపాడు: ఆ ఇల్లు ఓ ఉద్యాన వనం.. వ్యవసాయ క్షేత్రం.. నందనవనం.. ఇలా చెప్పుకుంటూ పోతే మాటలు చాలవు. ఆ ఇంటి పెరట్లోకి వెళ్లగానే సేంద్రీయ ఎరువులతో పెంచే కూరగాయల మొక్కలు, రకరకాల పూలమొక్కలు స్వాగతం పలుకుతాయి. వ్యవసాయం పట్ల ఉన్న ఆసక్తితో, ఆరోగ్యం పట్ల శ్రద్ధతో ఇంటినే వ్యవసాయ క్షేత్రంగా మార్చేశారు చలివేంద్రపాలెం గ్రామ సర్పంచ్, రైతు బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయ విధానం, ఆ ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యం లభిస్తుందని అంటున్నారు శివనాగిరెడ్డి.

మట్టితో పని లేకుండా..

యూట్యూబ్‌లో వచ్చిన వీడియోలను వీక్షించిన శివనాగిరెడ్డి మట్టితో అవసరం లేకుండా మొక్కలు పెంచే విధానానికి ఆకర్షితులయ్యారు. ఆన్‌లైన్‌లో కోకోపిట్, అది నింపేందుకు కవర్లను కొనుగోలు చేశారు. ఉద్యానశాఖ అధికారుల సూచనలకు అనుగుణంగా నల్లని కవర్లలో కోకోపిట్ నింపి వాటిలో పసుపు, అల్లం, మిర్చి, టమాటా, బంతి, చామంతి మొక్కలు నాటారు. తమ డాబాను పూర్తిగా కోకోపిట్‌లో పెంచుతున్న మొక్కలతో నింపేశారు. ఎప్పటికప్పుడు ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటిస్తూ మొక్కల సంరక్షణకు సేంద్రీయ ఎరువులు, వర్మీకం పోస్టు వినియోగిస్తూ మొక్కలు సంరక్షిస్తున్నారు.



పెరట్లో పెంచుతున్న చెర్రీ మిర్చి



అల్లుకున్న దొండ, కాకర పాదులు

మొక్కల మయం..

ఇంటి పెరట్లో సుమారు అరసెంటు వరకూ ఖాళీ స్థలం ఉంది. వయోభారం రీత్యా వ్యవసాయానికి దూరంగా ఉంటున్నా, దానిపై ఉన్న ఆసక్తితో ఇంటి పెరటినే వ్యవసాయ క్షేత్రంగా మార్చారు. ఇంటి పెరట్లో ఏడాది పొడవునా కాచే దొండ పందిరి, కాకర, బీర, సొర, పొట్లకాయ, వీటితో పాటుగా బెండ, టమాటా, మిర్చి, తీగ బచ్చలికూర, చెర్రీ మిర్చి, ఆరోగ్యానికి మేలు చేసే ప్యాషన్‌ఫ్రూట్, బొప్పాయి, మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇంటికి అందాన్ని పెంచే రకరకాల పూలమొక్కలు పెంచుతున్నారు. బంతి, చామంతి, క్రాస్ బంతి, కనకాంబరం, అందానికి నిర్వచనంగా చెప్పే క్రోటన్ మొక్కలను పెంచుతున్నారు.

ఆరోగ్యం కోసమే..

కరోనా సమయంలో అన్ని కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలతోనే ఆరోగ్యం వృద్ధి చెందుతుందని గుర్తించారు. దీంతో తమ ఇంటి పెరటిలోనే రకరకాల కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. ఇంటి అవసరాలకు పోనూ మిగిలిన కూరగాయలను బంధువులు, ఇరుగు పొరుగుకి ఉచితంగా అందిస్తూ దాతృత్వం చాటుతున్నారు శివనాగిరెడ్డి.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి..

ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. సేంద్రీయ విధానం, ప్రకృతి పద్ధతిలో పెంచిన కూరగాయలను ఆహారంలో తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్య సమస్యలు తలెత్తవు. విపత్తులు వచ్చాక జాగ్రత్త పడే కంటే ముందస్తు జాగ్రత్తలు వహించటం మేలు. ఇంటినే నందనవనంగా మార్చితే ఆరోగ్యం, ఆహ్లాదం అన్నీ సమకూరుతాయి.

– బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, రైతు, సర్పంచ్, చలివేంద్రపాలెం

కార్యకర్తలకు అండగా ఉంటా



ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని కడవకొల్లు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇటీవల మృతి చెందిన పార్టీ నేత కొండలరావు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలందరూ కలిసి ఒకే కుటుంబంలా పనిచేస్తూ జగనన్న నాయకత్వాన్ని బలపర్చుదామని పిలుపునిచ్చారు. పెనమలూరు నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలు ఏ ఒక్కరికీ కష్టం వచ్చినా కుటుంబ సభ్యుడిగా తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేటేటి రాజబాబు, మంగినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత కె.భరత్‌కుమార్(ఏలూరు) సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

– విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానందం

ఉయ్యూరు: సోలార్ ప్లాంట్ల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ కృష్ణాజిల్లా ఎస్ఈ ఎం.సత్యానందం సూచించారు. ఉయ్యూరు మండలంలోని ఉయ్యూరు, గండిగుంట సబ్‌స్టేషన్‌లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆయా సబ్‌స్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా, సమస్యలపై సమీక్షించారు. అనంతరం ఉయ్యూరు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు.

మెరుగైన సేవలు అందించాలి..

ఎస్ఈ సత్యానందం మాట్లాడుతూ.. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సోలార్ ప్లాంటు ఏర్పాటుపై బహుళ ప్రయోజనాలను తెలియజేసి ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా శ్రద్ధ వహించాలని చెప్పారు. వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటంతో పాటుగా సంస్థ ఆదాయాన్ని పెంచటంలో బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. రైతులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈఈ కృష్ణనాయక్, డీఈఈ హేమకుమార్, ఏఈ బసవశాస్త్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానందం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ పోరంకి విశ్వశాంతినగర్, రాజమాత నగర్ ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా 100 అడుగుల రోడ్డు, పోరంకి – నిడమానూరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పెనమలూరు: కానూరులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ బుధవారం మహదేవపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా టీచర్స్‌కాలనీ, 80 అడుగుల రోడ్డు, పంటకాలువ రోడ్డు, ధనేకుల కల్యాణ మండపం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. స్థానికులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కంప్యూటర్ రిపేర్ షాపులో చోరీ

పెనమలూరు: కానూరులో కంప్యూటర్లు రిపేర్ చేసే షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప లిమ్రా కాలనీకి చెందిన ముళ్లపూడి రమేష్‌నాయుడు కానూరు పంటకాలువ రోడ్డులో టీచర్స్ కాలనీ సమీపంలో కంప్యూటర్ రిపేర్ షాపు నిర్వహిస్తున్నాడు. అతను షాపులో పని ముగించుకుని ఆదివారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అతను సోమవారం ఉదయం షాపు వద్దకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు షాపు షెట్టర్ తాళాలు పగుల కొట్టి షాపులోకి ప్రవేశించినట్లు గుర్తించాడు. షాపులో ఉన్న 3 ల్యాప్‌టాప్‌లు, పలు కంప్యూటర్ పరికరాలు చోరీకి గురయ్యాయని చెప్పాడన్నారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

మేలైన యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు

కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ తెలిపారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చిరు పొట్ట దశలో ఉన్న వరి పొలాలను వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రైతులు సబ్సిడీపై ట్రాక్టర్లు, టార్పాలిన్ పట్టాలను సరఫరా చేయాలని కోరారు. వరి పంట ఎకరాలకు 40 నుంచి 42 బస్తాలు వరకూ దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతులు యాజమాన్య చర్యలపై దృష్టి పెట్టాలని ఏఓ కిరణ్ సూచించారు.

ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణులు

పెనమలూరు: ఆయుర్వేద తొలి వైద్యుడు భగవాన్ శ్రీధన్వంతరి జయంతిని ఏపీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ మంత్రి కొలుసు పార్థసారథికి నాయీ బ్రాహ్మణుల సంఘ నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు వివరాలు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఆయూష్ ఆధ్వర్యంలో 2016 సంవత్సరంలో అక్టోబర్ 26 తేదీన ధన్వంతరి జయంతి అధికారికంగా గుర్తించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ జయంతి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆ తరువాత నుంచి ప్రతీ ఏటా ధన్వంతరి ఉత్సవాలు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తూ వైద్య వృత్తిలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రధానం చేస్తోందని చెప్పారు. ఈ సంప్రదాయాన్ని ఏపీలో కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు వణుకూరు సురేష్‌బాబు, పాతూరి మురళీకృష్ణ, అన్నవరపు బ్రహ్మయ్య, ఆకునూరు సుబ్బారావు, ఎం.కనకారావు, కాపవరపు ప్రసాద్, ద్రాక్షారపు సూరిబాబు, తెన్నేటి ప్రకాష్, ఇంటూరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు నట్టల నివారణ మందు వేయించాలి



మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశుసంవర్థకశాఖ సిబ్బంది

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలో గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో 5,709 గొర్రెలకు, 823 మేకలకు పశుగణ సహాయకుడు కె.రామకృష్ణ నట్టల నివారణ మందు అందించారు. గొర్రెలు, మేకలలో నట్టల వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కట్టుబోయిన నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు చాకిరి వెంకట నారాయణ, గొర్రెలు, మేకల పెంపకందారుల సహాయక సహకార సొసైటీ అధ్యక్షుడు కట్టుబోయిన జమలయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంపై లీకవుతున్న ట్యాంక్

నున్న(విజయవాడరూరల్): స్థానిక పంచాయతీ కార్యాలయం పై భాగంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ వరలు లీకై నీరు కారుతుంది. గత కొన్ని రోజులుగా నీరు లీకై ప్రజలు వేచి ఉండే వరండాలోకి నీరు వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ట్యాంక్ నుంచి నీరు లీక్ కావడంతో మరుగుదొడ్డి ఉపయోగించే వారికి నీరు అందడంలేదు. కొన్ని రోజులుగా కార్యాలయ సిబ్బంది, ప్రజలు అవస్థలు పడుతున్న పట్టించుకున్నా వారు లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే వాటర్ ట్యాంక్ రిపేరు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సంధ్యా సమయాన అరుణ కాంతులు



కాసరనేనివారిపాలెం వద్ద అరుణకాంతుల నడుమ శివాలయం

సాయంసంధ్యా సమయాన ఆకాశం అరుణకాంతులు విరజిమ్మింది. అస్తమిస్తున్న భానుడు తమ అరుణ కాంతులతో ప్రకృతి పరవశించింది. మండలంలోని కాసరనేనివారిపాలెం వద్ద ఏటిపాయ అరుణవర్ణంతో శోభిల్లింది. ఈ దృశ్యం ప్రకృతి ఆరాధకుల్ని అమితంగా ఆకట్టుకుంది. – కంకిపాడు

2 నుంచి చినకంచిలో కార్తిక మాసోత్సవాలు

నున్న(విజయవాడరూరల్): శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు జరుగుతాయని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా నెల రోజుల పాటు శ్రీమహాత్రిపురసుందరీదేవి సమేత శ్రీచంద్రమౌళీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం రుద్రాభిషేకం, మధ్యాహ్నం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీపాలంకరణ జరుగుతాయని చెప్పారు. ప్రతి ఆది, సోమవారాల్లో విశేష కార్యక్రమాలు, మాస శివరాత్రినాడు సహస్ర జ్యోతి లింగార్చన, శివునికి కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిస్తాం

రామవరప్పాడు: ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రసాదంపాడు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 19న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'బాబోయ్ ఖాళీ స్థలాలు' కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామంలో మురుగు, వ్యర్థాలతో నిండిన ఖాళీ స్థలాలను గుర్తించేందుకు పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు. వీరు గ్రామంలో ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించి మెరక తోలించుకోవాల్సిందిగా స్థల యజమానులకు నోటీసులిస్తామన్నారు. త్వరలో ఖాళీ స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

డిస్టలరీస్‌లో సీఐడీ సోదాలు

కంకిపాడు: డిస్టలరీస్‌లో సీఐడీ అధికారులు మంగళవారం సోదాలు చేపట్టారు. మండలంలోని దావులూరు గ్రామంలో గల బీఆర్కే స్పిరిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, గొడవర్రు గ్రామంలోని బీవీఎస్ డిస్టలరీస్‌లో అదనపు ఎస్పీ క్లైలే పాల్ నేతృత్వంలో ప్రత్యేక బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. గడిచిన ఐదేళ్లలో ఆయా డిస్టలరీస్ ద్వారా జరిగిన కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ఆయా డిస్టలరీస్‌లో సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సీఐడీ బృందాలకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది సహాయకులుగా వ్యవహరిస్తున్నారు.

సరిహద్దు విషయమై ఘర్షణ.. కేసుల నమోదు

పెనమలూరు: పోరంకిలో సరిహద్దు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగటంతో పోలీసులు మంగళవారం ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ప్రభునగర్‌కు చెందిన తోటకూర త్రినాథ్‌కు తూముల సెంటర్‌లో స్థలం ఉంది. అతను సోమవారం తన స్థలం చుట్టూ సరిహద్దు గోడ నిర్మిస్తుండగా పక్క స్థలానికి చెందిన తోటకూర రామ్మోహన్‌రావు, అతని భార్య శేషకుమారి సరిహద్దు విషయమై అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో త్రినాథ్‌పై రామ్మోహన్‌రావు దంపతులు కొడవలితో దాడి చేశారు. ఈ ఘటనలో త్రినాథ్‌కు గాయాలయ్యాయి. త్రినాథ్ తమ స్థలంలో గోడ నిర్మిస్తుండగా తన భర్త రామ్మోహన్‌రావు అభ్యంతరం తెలుపగా త్రినాథ్ దాడి చేశాడని, తాను అడ్డుకోగా తనపై కూడా అతను దాడి చేశాడని తోటకూర శేషకుమారి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

రేపు దేశ్ కా ట్రక్కు ఉత్సవ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ఈ నెల 24న విజయవాడలో దేశ్ కా ట్రక్కు ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కౌల్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రక్కింగ్ కమ్యూనిటీని వారికి పనికొచ్చే సూచనలతో బలోపేతం చేస్తామన్నారు.